ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 16 డిసెంబరు 2024



నేటి నుంచి సీఎం కప్ జిల్లా పోటీలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) సోమవారం నుంచి సీఎం కప్ జిల్లా పోటీలు ప్రారంభం అవుతాయని జిల్లా క్రీడా సంస్థ చైర్మన్, కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వివేకానంద స్టేడియంలో జరిగే ఈ పోటీల మొదటి రోజు వాలీబాల్, చదరంగం, జూడో రెండవ రోజు కబడ్డీ, బాక్సింగ్, మూడవ రోజు కోకో, ఒపెన్ ఫుట్ బాల్, నాలుగవ రోజు పరుగు పందెం, కిక్ బాక్సింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, యోగ, ఐదవ రోజు నెట్ బాల్, సైక్లింగ్, బాస్కెట్‌బాల్, ఆరవరోజు హ్యాండ్‌బాల్, బేస్‌బాల్, రెజ్లింగ్ తదితర పోటీలు జరుగుతాయని పై ప్రకటనలో పేర్కొన్నారు. వీటితో పాటు సోమవారం ఎస్‌కెఎన్‌ఆర్ కళాశాలలో, గీతా విద్యాలయంలో క్రికెట్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత పరామర్శ

జగిత్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చేని నగేశ్ ఇటీవల మృతి చెందగా ఆదివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు.

బినామీలకు అడ్డుకట్ట

- బడుల్లో ఉపాధ్యాయుల ఫొటోల ప్రదర్శన
- ప్రారంభమైన ప్రక్రియ
- జిల్లా వ్యాప్తంగా 3,887 మందికి పైగా టీచర్లు

జగిత్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే బోధన బాగుండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సమూలమైన మార్పులు తీసుకొస్తోంది. ఎక్కడా అవకతవకలు లేకుండా ఉండాలనే సకల్పంతో పగడ్బందీగా చర్యలు చేపట్టింది. అక్కడక్కడ ఉపాధ్యాయులు వివిధ రూపాల్లో పాఠశాలకు రాకుండా డుమ్మాలు కొడుతుంటారు. దీర్ఘకాలికంగా వారు పాఠశాలకు రాకుండా వలంటీర్లతో బోధన చేయిస్తుంటారు. గతంలో జిల్లాలో ఇలాంటి ఘటనలు కూడా వెలుగుచూశాయి. ఇక నుంచి అలా జరగటానికి ఏ మాత్రం అవకాశం లేకుండా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల ఫొటోలను ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.



జిల్లాలో పాఠశాలలు, ఉపాధ్యాయుల సంఖ్య.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జడ్పీ, కేజీబీవీ, మిని గురుకులాలు, మైనార్టీ వెల్ఫేర్, టీఎస్ మోడల్ స్కూల్స్ టీఎస్ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్స్‌కు చెందిన పాఠశాలల్లో గత విద్యా సంవత్సరం లెక్కల ప్రకారం 839 పాఠశాలలుండగా 3,887 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇందులో 514 ప్రాథమిక పాఠశాలలు, 91 ప్రాథమికోన్నత పాఠశాలలు, 234 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలలో 1,188 ఉపాధ్యాయులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 475 మంది, ఉన్నత పాఠశాలల్లో 2,224 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

మిగతా 8లో

పింఛన్ ఇప్పించండి...సారూ

తెలంగాణ ఉద్యమకారుడి వేడుకోలు


తునికి పెద్ద గంగారాం

జగిత్యాల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధన కోసం ఉద్యమం చేశా... ప్రత్యేక రాష్ట్రం ప్రకటించే వరకు గుండుతోనే ఉన్నా.. నిరాహార దీక్షలు...ధర్నాలు చేశా...కవితలతో ఉద్యమానికి అండదండలు అందించా... ఇప్పుడు ఉద్యమకారులకు ఇచ్చే పింఛన్ కోసం పోరాడుతున్నాను... అధికారులు కనికరించి పింఛన్ మంజూరు చేయాలని జగిత్యాల అర్బన్ మండలం మోతే గ్రామానికి చెందిన తునికి పెద్ద గంగారాం మొరపెట్టుకుంటున్నాడు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో తన గోడును వెల్లబోసుకున్నాడు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో భాగంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే వరకు వెంట్రుకలను పెంచుకోనని శపథం పూని దీక్ష చేశానని, అనేక ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యాయని వాపోయాడు. ఉద్యమ సమయంలో కళాకారుల సంఘీబావంలో భాగంగా అనేక కవితలు రాసి స్ఫూర్తిని అందించానన్నాడు. ప్రత్యేక రాష్ట్రం కళ సాకారం అయి దశాబ్ధం గడుస్తున్నా కళాకారుల పెన్షన్ మంజూరు కోసం అధికారుల చుట్టూ తిరుగుతూ అలిసి పోతున్నానని వాపోయాడు. తనకు పింఛన్ మంజూరు చేయాలని పలుమార్లు గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు మొరపె ట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పింఛన్ మంజూరు చేసి తగిన న్యాయం చేయాలని కోరుతున్నాడు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో కరీంనగర్ వన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ మహ్మద్ మునావర్, డాక్టర్ చెన్న భావ్య అనేక మంది చుట్టు పక్క గ్రామాలకు చెందిన పేషంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రూ లక్ష విలువ గల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్లు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందిని నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నిర్వాహకులు, జైనా మాజీ ఉపసర్పంచ్ కోరుట్ల శ్రీనివాస్, ఆసుపత్రి మేనేజర్, క్యాంపు ఇన్‌చార్జి వెల్మరెడ్డి సంతోష్‌రెడ్డి, వైద్య సిబ్బంది సామ్రాట్, సతీష్, సాయి, శ్రీనివాస్, సంబెట తిరుపతి, గడ్డి రాజన్న, గుడ్ల విజయ్‌కుమార్, సుంకు మదు సూధన్, కుడిక్యాల మహేష్, కట్ట భువనేశ్వర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు వీఆర్‌ఏ వారసుల వినతి

రాయికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పర్యటనకు ఆదివారం వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను రాయికల్ మండల 61 సంవత్సరాల పైబడిన వీఆర్‌ఏల వారసులు కలిసి వినతి పత్రం సమర్పించారు. జీవో నెం.81/85 ప్రకారం రాష్ట్రంలో మిగిలిపోయిన 3797 మందికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. త్వరలో శాసన మండలిలో జరుగబోయే మండలి సమావేశంలో చర్చించి ఉద్యోగాలు వచ్చేలా చొరవ తీసుకోవాలన్నారు. మండల వీఆర్‌ఏ జేఏసీ నాయకులు మహ్మద్ నసీర్, పుట్ట నరేష్, ముక్కెర లక్ష్మీనర్సయ్య, తిరుపతి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రీ, పట్టణ అధ్యక్షుడు మైలారపు రాంబాబు, సభ్యులు ఎల్మి రవీ, కొత్త నవీన్, చాడ సురేష్, కోట కిరణ్, పడిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతంగా గ్రూప్ 2 పరీక్ష

- 50శాతం కన్నా తక్కువగా పరీక్షకు హాజరైన అభ్యర్థులు
- పరీక్ష సరళని పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్
- పరీక్షకు ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిన అభ్యర్థిని

8


పరీక్ష ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూధన్

భక్తుల పెన్నిధి.. మల్లన్న సన్నిధి...

- భారీగా తరలివచ్చి.. బోనాలు సమర్పించిన భక్తులు

6


స్వామి దర్శనం కోసం క్యూలైన్ లో ఉన్న భక్తులు

అబాకస్ శిక్షణ అద్భుత గణిత సాధన

ట్రైనర్ అడ్లగట్ట గంగాధర్


శిక్షణకు హాజరైన శిక్షణార్థులతో ట్రైనర్ గంగాధర్

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గణిత సాధన సులభతరానికి అబాకస్ శిక్షణ ఆవశ్యకతము అని అబాకస్ ట్రైనర్ అడ్లగట్ట గంగాధర్ అన్నారు. అడ్లగట్ట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక పొన్నాల గార్డెన్‌లో 21ఏళ్ల పైబడిన యువకులు, వివిధ రంగాల్లో పని చేస్తూ గణితంపై మక్కువ ఉన్న వారికి ఆదివారం ట్రస్ట్ పక్షాన ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా బేసిక్ ఫండమెంటల్స్‌ను లెవల్ వన్‌ను నేర్పించామన్నారు. శిక్షణార్థులు అబాకస్‌లో తమ ప్రతిభను చాటారు. ప్రతి విద్యార్థికీ పోటీ పరీక్షలకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ట్రైనర్ గంగాధర్ మాట్లాడుతూ ఈఅబాకస్ శిక్షణ ద్వారా విద్యార్థులకు ఏకాగ్రతతో పాటు, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అబాకస్ గ్రాండ్ మాస్టర్ సాహితి, మధుకర్‌తో పాటు శిక్షణార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీగా ఆదిత్య


ఆదిత్య (ఫైల్)

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీగా కరండ్ల ఆదిత్య నియామకం పట్ల పలువురు జిల్లా ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 10న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ మహాసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా జగిత్యాలకు చెందిన కరండ్ల ఆదిత్యను సిటీ జాయింట్ సెక్రెటరీగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియమించారు. ఆదిత్య ప్ర స్తుతం నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 2వ సంవత్సరం చదువు తున్నాడు. విద్యార్థి నాయకుడిగా ఎల్‌బీ నగర్ కేంద్రంగా అనేక ఉద్యమాలు నిర్వహించగా, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఆదిత్యకు సిటీ జాయింట్ సెక్రెటరీగా బాధ్యత రావడం పట్ల సిటీ అధ్యక్ష, కార్యదర్శితో పాటు జగిత్యాలకు చెందిన పూర్వ ఏబీవీపీ బాధ్యులు అన్నల్‌దాస్ మురళి, మహేష్, దేవయ్య, ముదుగంటి రవీందర్‌రెడ్డి, ఏసీఎస్ రాజు, సంపూర్ణచారి, కరండ్ల మధుకర్ అభినందించారు.

నవోదయ విద్యాలయాల కేటాయింపు హర్షణీయం

రాయికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అత్యున్నతమైన ప్రమాణాలతో సెంట్రల్ సిలబస్‌తో కూడిన ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలను తెలంగాణకు కేటాయించడం హర్షణీయమని తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలకు జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా సంఘం పక్షాన ప్రధాన మంత్రి, కేంద్ర విద్యా శాఖ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీల్లో ప్రతిభ

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో మెట్‌పల్లి పట్టణంలోని మీనాక్షి నృత్య కళా నిలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళా నిలయం విద్యార్థులు హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గల ఎన్టీఆర్ కళా మందిరంలో ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సహకారంతో శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవ సందర్భంగా తెలుగు రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కళా నిలయం ఉపాధ్యాయురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో నిలయంలో నృత్యం నేర్చుకున్న విద్యార్థులు అంకతి విశ్వంభర, శ్రీ గాయత్రి హర్షాలి, అక్షిత రిత్వక, వైజ్ఞానిక, నత్యి శ్రీ, శ్రీకృత, సుదీక్ష ప్రతిభ కనబరిచారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మెమెంటో అందించి అభినందించారు.

కార్మిక సంఘాల మీటింగ్‌ను జయప్రదం చేయండి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు డిసెంబరు 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే మీటింగ్‌కు కార్మికులు హాజరై విజయ వంతం చేయాలని రాష్ట్ర ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం జగిత్యాల పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు జీవో నెం.51ను సవరించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ప్రభుత్వమే ప్రత్యేక గ్యాస్ ట్రెజరీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగానే పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20లోపు తమ సమస్యల పరిష్కారానికి జేఏసీని చర్చలకు పిలువని పక్షంలో 20వ తేదీ తర్వాత ఏరోజైనా నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులి మల్లేశం, వంగ రాజేశం, సాతాల రాజేందర్, గుడిసె దేవయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాయికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 16 నుంచి 21 వరకు జగిత్యాల జిల్లాలో జరుగనున్న జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ పోటీల్లో త్రిష, అలైఖ్య, అక్షితలు, వాలీబాల్ పోటీల్లో రమేష్, సాహిత్య, అలేఖ్య, అథ్లెటిక్స్‌లో మానస, మౌనిక, అలేఖ్య, ఖోఖో విభాగంలో వీరేంద్ర, సాహిత్య, అక్షితలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డిలు అభినందించారు.

ఉద్యమ తెలంగాణ తల్లినే ప్రతిష్ఠించుకుంటాం

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ● జగిత్యాలలో 22 అడుగుల ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

జగిత్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని అంగీక రించే ప్రసక్తే లేదని, ఉద్యమ తెలంగాణ తల్లినే గ్రామ గ్రామాన ప్రతి ష్ఠించుకుంటామని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వ కుంట్ల కవిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దరూర్ శివారులో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జగిత్యాలకు వచ్చిన కవితకు స్థానిక నేతలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం ప్రభుత్వ జీవోను ధిక్కరించి 22 అడుగుల ఉద్యమ తెలంగాణ తల్లి ప్రతిష్ఠాపనకు కవిత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ఉద్యమ తెలంగాణ తల్లిని, తల్లిలోని బతుకమ్మను కాపాడుకుంటామని... తెలంగాణ అస్థిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని గ్రామ గ్రామాన ఎండగడుతామన్నారు. గెజిట్ ఇచ్చినా, కేసులు పెట్టిన భయపడేది లేదన్నారు. జగిత్యాల అంటే బీఆర్‌ఎస్ గడ్డ అని అందరికి తెలుసునని, ప్రజలు ఎన్నుకున్న నాయకులు పార్టీకి ద్రోహం చేసి పోయారు కానీ కార్యకర్తలు అండగా ఉన్నారని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఎమ్మెల్యే చేయడం ఖాయమన్నారు. ఆనాడు ఉద్యమంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకున్నామని, ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విగ్రహాన్ని, ఆమె చేతిలో ఉండే బతుకమ్మ కూడా వద్దంటోందని విమర్శించారు. ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, తెలంగాణ జాగృతి నాయకులు డాక్టర్ అనూప్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

గురుకులాల పై రేవంత్ సర్కార్ కుట్ర

సారంగాపూర్ : కేసీఆర్ ప్రవేశపెట్టిన గురుకుల పాఠశాలలపై రేవంత్ సర్కార్ కుట్ర చేసిందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. మూడు రోజుల క్రితం సారంగాపూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన తెలుసుకుని ఆదివారం పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి వంట గదులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గురుకుల బాట ఉద్యమాన్ని పరిగణలోకి తీసుకుని చర్యలు చేపడుతుండటం పట్ల ఆమె రాష్ట్ర ప్రభు త్వాన్ని స్వాగతించారు. ముందు ముందు ప్రతి అంశంపై పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం సంక్షేమ పాఠశాలల్లో చేపడుతున్న మార్పుల్లో కస్తూర్బా పాఠశాలలు లేక పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యంరావు, నాయకులు గంగారెడ్డి, ప్రసాద్, ప్రభాకర్, జలేందర్, రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.


జగిత్యాలలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


తిమ్మాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఇతరులు

ధర్మపురి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిమ్న జాతుల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేద్కర్ చేసిన చట్టాల ద్వారానే ప్రభుత్వాలు నడుస్తూ ముందుకు వెళ్తున్నాయన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. ఈ విగ్రహ ఏర్పాటు ఏర్పాటులో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు భారీ ఎత్తున స్వాగతం పలికారు. ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి-రాజేష్, జక్కు పద్మ- రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, తిమ్మాపూర్ పీఏసీఎస్ చైర్మన్ సాయిని సత్యనారా యణ, ప్రకాష్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు నవీన్, స్వామి, సత్తయ్య, రాజలింగు, అనంతుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి కొలమానం లేదని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రెండవ వార్డులో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి రూ.100 కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపించామని, అందుకు సీఎం హామీ ఇచ్చారన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందజేస్తామన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల మౌలిక సదుపాయాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 34 కోట్ల నిధులను మంజూరు చేసిందని, వార్డులో 82 మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేశామన్నారు. వైస్ చైర్మన్ శ్రీనివాస్, గిరి నాగభూషణం పాల్గొన్నారు.

● పట్టణంలోని పావని కంటి ఆస్పత్రి ఎదుట ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 16 మంది పేదలకు కంటి శస్త్ర చికిత్సలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేశారు.


వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతి


పటేల్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక కొత్తబస్టాండ్ వద్ద గల పటేల్ విగ్రహానికి బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో పాటు, బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ బాధ్యులు రాంచందర్, వంశీ, రోజా, నరేష్, మల్లీశ్వరీ, హృషికేష్ తదితరులున్నారు. అలాగే భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ వర్ధంతిని నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. దేశ సమైక్యత. సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు ఆయన చూపిన బాట స్ఫూర్తిదాయకమన్నారు. సంఘ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

కథలాపూర్ : దేశ మాజీ ఉపప్రధాని, భారతరత్న, ఉక్కు మనిషి సర్దార్ వల్లాభాయ్‌పటేల్ 74వ వర్ధంతి వేడుకలను మండలంలోని సిరికొండలో యువకులు ఘనంగా నిర్వహించారు. 565 సంస్థానాలను నిజాం మెడలు వంచి హైదరాబాద్‌లో విలీనం చేసిన యోధుడని కొనియాడారు. ఆయన దేశ ఐక్యత, సమానత్వం, సమగ్రత, సార్వభౌమత్వానికి యువతక స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, మల్యాల మారుతి, కాశోజి ప్రతాప్, దొమ్మాటి రాజేందర్, వీరేందర్ తదితరులు ఉన్నారు.

పరిగెడితే పతకమే



నాసిక్‌లో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకంతో రామానుజమ్మ

- ఏడు పదుల వయస్సులో అథ్లెట్‌గా రాణింపు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు
- సత్తాచాటుతున్న మాస్టర్ అథ్లెట్ తమటం రామానుజమ్మ

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏడు పదుల వయస్సులో ఆమె అలుపెరగని పరుగు తీస్తోంది. మాస్టర్ అథ్లెట్‌గా సత్తా చాటుతూ నంబరువన్‌గా నిలుస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన తమటం రామానుజమ్మ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 70 సంవత్సరాల వయస్సు పైబడిన విభాగాల్లో పరుగు పందెంలో తనకు ఎవరూ సాటి లేరని నిరూపిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. రామానుజమ్మకు చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి. పాఠశాల నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు దాదాపు వెయ్యి పతకాల వరకు సాధించింది. చిన్నతనంలో అమ్మనాన్న, వివాహ అనంతరం భర్త సహకారంతో అథ్లెటిక్స్‌లో విజయం సొంతం చేసుకుంది. మాస్టర్ అథ్లెటిక్స్ మహిళల 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజయాలను సాధించింది. 2023లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో, తమిళనాడు కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. 2018లో తెలంగాణ గచ్చిబౌలిలో జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, బొంబాయిలో 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించింది. 2024 మహారాష్ట్ర నాసిక్‌లో, యూపీ అయోధ్యలో 800, 1500 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలను సాధించింది. 2023 సెప్టెంబరులో మలేషియాలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో భారత్ నుంచి పాల్గొన్న తమటం రామానుజమ్మ 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించి 70 సంవత్సరాల వయస్సులో దేశానికి వన్నె తెచ్చింది. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకం సాధించిన రామానుజమ్మను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు సన్మానించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా దాతల సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. ప్రభుత్వం నుంచి మాస్టర్ అథ్లెటిక్స్‌కు కూడా సహకారం అందించాలని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం 71 సంవత్సరాల రామానుజమ్మ నిత్యం యోగా సాధన కూడా చేస్తోంది.


మలేషియాలో కాంస్య పతకం సాధించిన తరువాత జాతీయ జెండాతో రామానుజమ్మ

మనస్సు ఆనందంగా ఉంటే వయస్సు తగ్గుతుంది


- తమటం రామానుజమ్మ, మాస్టర్ అథ్లెట్, అంతర్జాతీయ క్రీడాకారిణి

మనస్సును ఆనందంగా ఉంచితే వయస్సు తగ్గుతుంది. ఇదే నా ఆరోగ్య రహస్యం. మాస్టర్ అథ్లెట్‌గా రాణించడానికి మనస్సును ఆనందంగా ఉంచడమే ప్రధాన కారణం. ప్రతీరోజు యోగా, వ్యాయామంతో ఫిట్నెస్ సాధిస్తున్నాను. అనారోగ్య(బీపీ, షుగర్) సమస్యలు లేకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తున్నాను.

అథ్లెట్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహించాలి


- గొట్టెముక్కల శేఖర్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది క్రీడాకారులు మరుగున పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారులను ప్రోత్సహించాలి. మాస్టర్ అథ్లెట్స్‌కు ప్రభుత్వం కొని నిధులను కేటాయించాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి ఎంపికైన క్రీడాకారులు సొంత డబ్బులతో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లలేక పోతున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

- సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

గోదావరిఖని, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూ నిత్యం ప్రజల మధ్య ఉండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సీపీఐ నాయ కులకు సూచించారు. ఆదివారం భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు కమ్యూనిజాన్ని ఆదరిస్తున్నారని, అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావడమే కారణమన్నారు. డిసెంబర్ 26 సీపీఐ వంద సంవత్సరాల్లోకి అడుగు పెడుతుందని, ఈ సందర్భంగా వాడవాడన, గ్రామ గ్రామాల వంద వసంతాల కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాల చరిత్రలో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, విద్యార్థులకు సంబంధించిన అనేక హక్కులను సాధించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడవ సారి అధికా రంలోకి వచ్చిన తరువాత ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలకు తహతహలాడుతున్నాని, దేశంలో ప్రజలపై పన్ను భారా న్ని మోపుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకుండా ఒక్కో వస్తువుపై ఒక్కో రకమైన పన్ను విధిస్తున్నారన్నారు. రాబోయే కాలం ఎన్నికల కాలమని, స్థానిక సంస్థలతో పాటు పంచాయతీ, మండల ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త గెలుపు కోసం సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, మడ్డి ఎల్లయ్య, స్వామి, ఆరెల్లి పోషం, తాళ్లపల్లి మల్లయ్య, మార్కపురి సూర్య, ప్రీతం, ఓదమ్మ, కన్నం లక్ష్మీనారాయణ, రాజయ్య, లెనిన్, రమ, దప్పు రాజు, మొండి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాకేష్ (ఫైల్)

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామ శివారులో ఓ యువకుడు ద్విచక్రవాహనం మీద నుండి కింద పడి మృతి చెందాడు. వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గురుకుంట్ల రాకేష్ (30) శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి వెళ్తుండగా జగ్గయ్యపల్లి గ్రామ శివారులో ద్విచక్రవాహనంపై అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికి అక్కడే మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడం వల్లే రాకేష్ మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రాకేష్‌కు నవంబరు 10న నిశ్చితార్థం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హుజూరాబాద్‌లో ప్రైవేట్ స్కూల్ వ్యాన్ దగ్ధం

హుజూరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరంగల్ రోడ్‌లో గల మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో పార్క్ చేసి ఉన్న స్కూల్ వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం పాఠశాల ఆవరణలో నాలుగు వ్యాన్లు పార్క్ చేసి ఉండగా, ఒక వ్యాన్‌లో నుంచి మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. సెలవు దినం కావడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే నివేశన గృహాలు, సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు మద్యం తాగి, అగ్గిపెట్టె, సిగరెట్లు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పాఠశాల యాజమాన్యం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దగ్ధమైనస్కూల్ వ్యాన్

విద్యార్థినికి వేధింపులు.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు ప్రాంతంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిని అదే కళాశాలకు చెందిన ఉద్యోగి అసభ్యకరంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశాడని అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. కొద్ది రోజులుగా విద్యార్థినిని వేధింపులకు గురి చేస్తుండడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. కాగా ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు ఎస్ఐ సాంబమూర్తి నిరాకరించారు.

గంజాయి పట్టివేత


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అశోక్‌నగర్ ప్రాంతంలో గంజాయిని పట్టుకుని నిందితుడిని అరెస్టు చేశామని కరీంనగర్ ఒకటో థాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన నీరజ్‌కుమార్(19)ను అశోక్‌నగర్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి కిలో 655 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. బీహార్ రాష్ట్రంలోని పర్మబిర్‌బల్ ప్రాంతానికి చెందిన నీరజ్‌కుమార్ 8 నెలల క్రితం కరీంనగర్‌కు వచ్చి కూలీగా పనిచేస్తుండేవాడు. ఐదు నెలల కిందట బీహార్‌కు వెళ్లిన నీరజ్‌కుమార్ అక్కడ గంజాయికి అలవాటుపడ్డాడు. డబ్బులు లేకపోవడంతో కరీంనగర్‌లో గంజాయిని విక్రయించి సంపాదించాలని పథకం వేశాడు. బీహార్‌లో 2 కిలోల గంజాయిని కొనుగోలు చేసిన నీరజ్‌కుమార్ 15 రోజుల కిందట కరీంనగర్‌కు చేరుకున్నాడు. కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో అద్దె గదిలో ఉంటూ నిత్యం గంజాయి సేవించేవాడు. మిగతా గంజాయిని విక్రయించేందుకు శనివారం సాయంత్రం గౌరిశెట్టి కాంప్లెక్స్ వద్ద ఉండగా అప్పుడే అక్కడకు వచ్చిన పోలీసు వాహనాన్ని చూసి నీరజ్‌కుమార్ పారిపోయేందుకు ప్రయత్నిం చాడు. వెంటనే పోలీసులు అతడిని తనిఖీ చేసి కిలో 655 గ్రాముల గంజాయి, ఒక మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నీరజ్‌కుమార్‌ను ఆదివారం కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

ఆదివారం.. ఆధ్యాత్మికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. మల్లన్న బోనాలు, అయ్యప్ప పడిపూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాజన్న ఆలయం భక్తజన సంద్రంగా మారింది. జగిత్యాల జిల్లాలోని మల్లన్నపేట మల్లికార్జున ఆలయంలో బోనాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు వేల సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


రాజన్న దర్శనం కోసం క్యూలో బారులుదీరిన భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. షష్టిమాసం సందర్భంగా ఆదివారం స్వామివారి ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మల్లన్న పట్నాల నేపథ్యంలో ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు తెల్లవారు జాము నుంచే రాజన్న దర్శనం కోసం క్యూలో బారులుదీరారు. అనంతరం ఆలయంలోకి ప్రవేశించి రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోడెమొక్కు క్యూలో రాజన్న దర్శనానికి మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- ఆలయాలను సందర్శించిన ప్రభుత్వ విప్

వేములవాడలోని పలు దేవాలయాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. పట్టణంలోని దత్తాత్రేయస్వామి, కేదారేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేదారేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

వెల్గటూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని శ్రీరామ భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం అంగరంగ వైభంగా నిర్వహించారు. గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమం భక్తితో నిర్వహించారు. అనంతరం రత్నాకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, బందెల ఉదయ్, అయ్యప్ప దీక్షపరులు పెద్ది శ్రీనివాస్, గంట్యాల రాజేందర్, సంకోజు నరేష్, సిరంగి సంతోష్ కుమార్, బోడకుంటి రమేష్, మనీష్, రామస్వామి, పెద్దూరి భరత్ పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న అయ్యప్ప దీక్ష స్వాములు


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

భక్తుల పెన్నిధి..మల్లన్న సన్నిధి...

- భారీగా తరలివచ్చి.. బోనాలు సమర్పించిన భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం అంతా కిటకిటలాడింది. జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం, సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరసర ప్రదేశాలు ఎటూ చూసిన భక్తులతో పోటెత్తింది. ఆలయం నలువైపులా వాహనాలతో, భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని, స్వామివారికి ప్రీతిపాత్రమైన బంతిపూలు మెడలో ధరించి ఒగ్గు పూజారుల ఢమరుక నాదాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 96,030 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కల్గకుండా ఎస్‌పీసీ విద్యార్థులు సేవలను అందించారు. జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు

- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- వృథా అవుతున్న నిధులు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 15,(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతి వనాలను పట్టించుకోకపోవడంతో లక్షలు రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మొ క్కలతో పాటు ఇతర వసతులు వృథాగా మారాయి. గ్రామాల్లో ఆహ్లాదం కోసం పల్లె పార్కులుగా తీర్చి దిద్దాలనే ఆలోచనతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి వృథాగా మారాయి. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని 24గ్రామపంచాయతీలు ఉండగా మంగపేట మినహా మిగతా 23గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ భూములను గుర్తించి గత ఐదు సంవత్సరాల క్రితం లక్షలు ఖర్చుచేసి మొక్కలు నాటారు. వాటి నిర్వహణ కూడా ప్రభుత్వం డబ్బులు వెచ్చించింది. ఉపాధి హామీ పథకం గ్రామాల్లో పలె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసశారు. పిల్లలు, పెద్దలు సేదతీర్చుకునేందుకు, వనాలలో వాకింగ్ ఇతర ఆరోగ్యకరమైన ఎక్సర్‌సైజ్ చేసుకునేందుకు వీటిని తీర్చి దిద్దారు. పల్లెప్రకృతి వనాలు పెట్టి సుమారు రెండు సంవత్సరాల వరకు ఉపాధిహామీ సిబ్బంది చూసుకునేది. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పల్లెప్రకృతి వనాలలో మొక్కలకు నీరు పోయించడంతో పాటు వనాలలో పెరిగిన గడ్డి కూడా ఈజీఎస్ కూలీలద్వారా తీయించారు. పల్లె ప్రకృతి వనానికి ఒక్కొక్క గ్రామానికి సుమారు లక్ష రూపాయల నుంచి 1.70.000 ఉపాధిహామీ ద్వారా ఖర్చు చేశారు. పల్లెప్రకృతి వనాలు కొన్ని గ్రామాలలో గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు ఈజీఎస్ ద్వారా పల్లెప్రకృతి వనసంరక్షణ నిర్వహించి అనంతరం ఈజీఎస్ తప్పుకొని గ్రామపంచాయతీలకు అప్పగించారు. గ్రామపంచాయతీకి అప్పగించడంతో ప్రకృతి వనం నిర్వహణపై పెద్దగా మొగ్గుచూపులేదు. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామ కార్యదర్శులు కూడా పల్లెప్రకృతి వనాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఏపుగా పెరిగిన మొక్కల నిర్వహణలేక ఎండిపోతున్నారు. ప్రభుత్వం ప్రకృతి వనాలకు లక్షలు ఖర్చుచేసి మొక్కలను పెంచితే నిర్వహిణ లేక ఎండిపోతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి వనాలను సంర క్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మీర్జంపేట పల్లె ప్రకృతివనం


మీర్జంపేటలోని పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన చెట్టు

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ


ధర్మపురి గోదావరి నది వద్ద స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. అనంతరం భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు తిరుగు ప్రయాణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నదీ వరకు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగనీయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నదిలో స్నానాలు ఆచరించిన అనేక మంది భక్తులు స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- వైభవంగా దత్తాత్రేయుడి జయంత్యుత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త జయంత్యుత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ మిడ్ మానేరు బ్యాక్ వాటర్ నుంచి గుట్ట పైకి వంతెన త్వరితగతిన నిర్మించేలా చూస్తానన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకునేందుకు మంత్రి పొన్నం విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోటు ద్వారా గుట్టపైకి చేరుకున్నారు. దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి వెంట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు రవీందర్, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు ఉప్పుల అంజన్ కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాగాని వెంకటేష్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ



లక్ష్మీనరసింహస్వామి శావతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెల్గటూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా కిషన్‌రావుపేట లోని శ్రీ నాగపల్లి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అర్చకులు స్వామి వారి అర్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పాటలు పాడుతూ భజన చేస్తూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. నర్సింహస్వామి గోవిందా... గోవిందా అంటూ ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం చెక్కబండి దామోదర్‌రెడ్డి వనజారెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, గౌరవ అధ్యక్షులు పూదరి రమేష్, కుమ్మరి వెంకటేష్, తరాల శివకుమార్, పాదం వెంకటేష్, గౌరు తిరుపతి, పాదం సాయి, రాయమల్లు పాల్గొన్నారు.

భక్తులపై తేనెటీగల దాడి

చందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : చందుర్తి మండలం మర్రిగడ్డ మల్లికార్జున స్వామి ఆలయంలో మొ క్కులు చెల్లించేం దుకు వచ్చిన భక్తులపై ఆదివారం తేనెటీగల దాడి చేయడంతో పదిమందికి పైగా గాయపడ్డారు. మండలంలోని మర్రిగడ్డ శివారులోని మల్లికార్జున స్వామి ఆలయంలో బోనం మొక్కు చెల్లించేందుకు భక్తులు వచ్చారు. ఆలయ పరిసరాల్లోని గిరక తాటి చెట్ల వద్ద బోనం వండేందుకు పొయ్యి ఏర్పాటు చేసుకొని మంట పెట్టారు. పొగ రావడంతో గిరక తాటి చెట్లపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి అక్కడ ఉన్న భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో మరి గడ్డకు చెందిన మల్యాల అంజయ్య, భైరగోని ఎల్లయ్య, మల్యాల రాజవ్వ, కత్తి లస్మవ్వ, మల్యాల లక్ష్మి. స్రవంతితోపాటు వట్టెంల గ్రామానికి చెందిన పచ్చిమట్ల మల్లవ్వ అనే వృద్ధురాలు, ఐదేళ్ల గగన అనే బాలిక మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వెంటనే బాధితులను చికిత్స నిమిత్తం వేముల వాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఆకుల కొమురయ్య గౌడ్ ఆదివారం ప్రమాదవశాత్తు ఈతచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు కొమురయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృత్తిపై ఆధారపడ్డ గీత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని , కొమురయ్యకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని గౌడ కులస్థులు కోరారు.

అదుపు తప్పి లారీ బోల్తా

మల్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు స్టేజీ సమీపంలో శనివారం అర్ధరాత్రి జగిత్యాల వైపు వెలుతున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. రాత్రి సమయం కావడంతో ఇతర వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. లారీ వివరాలు తెలియక పోగా ఎలాంటి నష్టం జరుగలేదని స్థానికులు తెలిపారు. లారీ త్వరగా తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు ఆలస్యం అయింది.

స్వామియే.. శరణం అయ్యప్ప

- కఠిన నియమాల దీక్ష
- ఆధ్యాత్మికత, క్రమశిక్షణాయుత జీవితానికి దోహదం



కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప దీక్ష కఠిన మైంది. అనేక నియమ నిబంధనలతో కూడుకున్నది. దీక్ష తీసుకున్న వ్యక్తి ఆధ్యాత్మిక, క్రమశిక్షణాయుత జీవితానికి అలవాటు పడుతాడు. దేహమే దే వాలయం, పరిశుభ్రతే పరమాత్మ అని నమ్మి దేహంతో పాటు ఇల్లు, పరిసరాలు, ఆలయాలు శుద్ధిగా ఉంచుకుంటూ దీక్షలు కొనసాగిస్తే దక్షత పెరుగుతుంది. ఆరోగ్యం , ఆధ్యాత్మికత, ప్రశాంతత, సరికొత్త జీవన విధానం ఏర్పడుతాయి. దీక్షల్లో స్థాయిలను బట్టి కన్నె, కత్తి, గంట, గద, గురు స్వాములుగా వ్యవహరిస్తుంటారు. ఏ స్థాయి స్వామి అయినా ప్రతి దీక్షాపరుడు ఓ అయ్యప్ప ప్రతిరూ పంగా భావిస్తుంటారు. వ్యక్తిలో పరమాత్మను దర్శించాలన్నదే దీని పరమార్థం. తొలిసారి దీక్షను స్వీకరించే వారు తల్లి లేదా గురుస్వామి చేతుల మీదుగా స్వీకరిస్తారు.

దీక్షను ద్విగుణీకృతం చేసుకోవాలి...

- శ్రీభాష్యం శ్రీనివాసాచార్య గురుస్వామి



దీక్షాధారులు నియమ ని బంధనలు పాటిస్తూ దీక్షను ద్విగుణీకృతం చేసుకోవాలి. ఆరోగ్యం, పరిసరాల పరిశు భ్రత ముఖ్యం. భక్తిభావన, ఆధ్యాత్మిక చింతన అవసరం. ఇతరుల పట్ల ప్రేమ, సోదరభావం, సహనం, గౌరవం, ఆదరాభి మానాలతో మెలగాలి. మనసారా స్వామిని మదిలో నిలుపుకోవాలి.

దీక్షా కాలంలో నియమ నిబంధనలు



- దీక్ష తీసుకున్న వ్యక్తి పీఠాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతినిత్యం రెండు పూటలా తలస్నానం ఆచరించాలి. లఘు శంకకు వెళితే పాద ప్రక్షాలన, దీర్ఘ శంకకు వెళితే కంఠ స్నానం చేయాలి.
- నలుపు రంగు దుస్తులు ధరించాలి. మత సంప్రదాయాలను అనుసరించి తిరుమణి, శ్రీచూర్ణం, విభూతి, చందనం, గంధం, కుంకుమ బొట్టు ధరించాలి.
- రెండు పూటలా పూజలు, నిత్య ఆరాధన చేయాలి. తొలిసారి దీక్ష తీసుకున్న వారు పెద్ద పాదం నడవాలి. ప్రతిసారి నడవవచ్చు.
- ఒకే పూట అన్నం, రెండవ పూట సాయంత్రం అల్పాహారం స్వీకరించాలి.
- భూశయ్య, బ్రహ్మచర్యం పాటించాలి. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలి.
- ఇంద్రియ నిగ్రహం పాటిస్తూ సాత్వికాహారం తీసుకోవాలి.
- ఆహార పదార్థాలను వృధా చేయకూడదు.
- మిత, మృదు భాషణ చేయాలి. పరుష వాక్కులు కూడదు.
- పాద రక్షలు ధరించరాదు.
- రక్త సంబంధీకులు, పాలివాళ్ళు మరణిస్తే మాల విసర్జన చేయాలి. సంవత్సర సూతకులకు ఆ యేడు దీక్ష కూడదు.
- పడి పూజలు, భజనల్లో పాల్గొనాలి. ఒక్క మారైనా అన్నదానం చేయాలి.

శబరిమల యాత్రలో జాగ్రత్తలు

దీక్షాకాలంలో కఠిన నియమాలు పాటిస్తూ గడపడం ఎంత ముఖ్యమో శబరిమలయాత్ర చేయడం అంతే ముఖ్యం. యాత్రలో కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుంది. అవగాహనా లోపంతో అష్ట కష్టాలు పడటం కంటే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే యాత్ర సఫలమవుతుంది. ఏ స్థాయి దీక్షాపరులైనా ఈ నియమాలు గుర్తుంచుకొని యాత్ర సాగిస్తే అయ్యప్ప కరుణాకటాక్ష వీక్షణాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఆ నియమాలు మీకోసం...

- గురుస్వామితో ఇరుముడి ధరించే ముందు రోజే ఇరుముడి సామగ్రితోపాటు మార్గమధ్యలో తినడానికి అల్పాహారం సిద్ధం చేసుకోవాలి.
- కప్పుకునేందుకు, పరచుకునేందుకు రెండు చద్దర్లు, దిండు, దీక్షా వస్త్రాలు, టవల్స్ వంటివి సిద్ధం చేసుకోవాలి.
- ఒక టార్చ్ లైట్, ఒక వాటర్ బాటిల్, ఒక పొడుగాటి కర్ర



(అక్కడిదైనా పరవాలేదు), బిస్కట్లు, గ్లూకోజ్ లేదా పండ్ల రసాల బాటిల్ ఉంచుకోవాలి.

- దీర్ఘకాలిక వ్యాధులున్నవారు అవసరమయ్యే మందులు, మామూలువారు జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, తదితర రుగ్మతలకు సంబంధించిన మందులు ఉంచుకోవాలి.
- సామాను ఎక్కువగా కాకుండా అన్నీ ఒకే బ్యాగులో పట్టేలా సర్దుకోవాలి.
- వాహనాల్లో, సర్వీసుల్లో వెళ్లేవారు మొదలే రూట్‌పై అవగాహన కలిగియుండాలి. ఇతర యాత్రలను వెళ్లేప్పుడుకానీ వచ్చేప్పుడుకానీ చేయవచ్చు.
- యాత్రలో మధ్యమధ్యలో ఆగడానికి సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలి. పాదయాత్రలో గురుస్వామితో కలిసి గుంపులు గుంపులుగా వెళ్లాలి. అడవి ప్రాంతం కావడంతో అనుక్షణం జాగ్రత్తగా ఉండాలి.
- సన్నిదానంలో మొక్కుల అనంతరం పదునెట్టాంబడి ఎక్కేముందు అతి జాగ్రత్త అవసరం. నెట్టుకోకుండా నెమ్మదిగా వెళితే దెబ్బలు తగలకుండా ఉంటుంది.
- స్వామి, మకరజ్యోతి దర్శనం తర్వాత ఉరుకులు, పరుగులు కూడదు. తొక్కిసలాట జరిగే అవకాశం ఉంటుంది.

మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు చాకలి ఐలమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మే డిపల్లి సత్యం అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో మహిళా విశ్వ విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టి గౌరవించిందన్నారు. అంతకుముందు మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించే పల్లె దవాఖాన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండలంలోని రజకసంఘం నాయకులు శంకర్, లక్ష్మన్, రాజు, గంగాధర్, రాజయ్య, జిల్లా వైద్య ఆ రోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ షాప్‌లో చోరీకి యత్నం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ముకరంపురలోని ఒక మొబైల్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. షాప్ యజమాని సాయిరాం శనివారం రాత్రి 10 గంటలకు షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు మొబైల్ షాప్ సగం వరకు తెరిచి ఉన్నట్లు గమనించి స్థానికులు సాయిరాంకు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు క్యాష్ కౌంటర్ తెరచి చూశారని, షాపులో ఎలాంటి వస్తువులు, డబ్బులు పోలేదని సాయిరాం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కోర్టు ఉద్యోగి

కొడిమ్యాల, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టులో ఉద్యోగం చేస్తున్న మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన ముదాం శంకర్ నిజాయితీ చాటుకున్నాడు. శంకర్ శనివారం కరీంనగర్‌కు వెళ్తుండగా పర్సు దొరికింది. గ్రామస్థులకు పర్సు దొరికిన విషయం తెలిపాడు. పర్సులో ఉన్న ఆధార్‌కార్డుతో గంగాధర మండలం ఇస్లాంపురం గ్రామానికి చెందిన దయ్యాల కొమురయ్యదిగా గ్రామస్థులు గుర్తించారు. పర్సులో ఉన్న 15 వేల నగదును కోర్టు ఉద్యోగి బాధితుడికి అందజేశాడు.

పంటలను ధ్వంసం చేస్తున్న అడవి పందులు



చందుర్తి మండలంలో అడవి పందులు ధ్వంసం చేసిన వరినారు


చందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్, మల్యాల, లింగంపేట పలు గ్రామాల్లో అడవి పందులు వరినారుతో పాటు చేతికందిన పత్తి, కంది పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవి పందుల బెడద నుంచి తమ పంటలను కాపాడు కోవడానికి రైతులు రాత్రి సమయాల్లో కాపు కాస్తున్నారు. అయినప్పటికీ అడవి పందులు అర్ధరాత్రి గుంపులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసి పోతున్నాయి. మండలంలోని పలు గ్రామాలు గుట్ట, అడవి ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. అర్ధరాత్రి వేళ గుంపులు, గుంపులుగా పందులు పంటలపై దాడికి పాల్పడి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది.

పంటలు చేతికి వచ్చే సమయంలో అడవి పందులు గుంపులుగా దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల గ్రామానికి చెందిన దమ్మ రవి అనే రైతుకు చెందిన పొలంలోని వరి నారును ధ్వంసం చేశాయి. అడవి పందుల బెడద నుంచి తమకు రక్షణ కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జమ్మికుంట To తమిళనాడు

- పత్తి బేళ్ల తరలింపు
- రెండు దశాబ్దాలుగా వ్యాపారం





మార్కెట్‌కు వచ్చిన పత్తి

జమ్మికుంట రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి వ్యాపార కేంద్రంగా జమ్మికుంట గుర్తింపు పొందింది. ఇక్కడ మార్కెట్‌కు వచ్చిన పత్తిని ఖరీదుదారులు కొనుగోలు చేసి బేళ్లుగా తయారు చేసి వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ఉన్న తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తారు. జమ్మికుంటలో రెండు దశాబ్దాలకు పైగా పత్తి వ్యాపారం సాగుతోంది. ఒకప్పుడు జమ్మికుంట మార్కెట్లో అపరాలు, వరి ధాన్యం కొనుగోళ్లు భారీగా జరిగేవి. ఈ ప్రాంత రైతులు పండించిన పంటలే కాకుండా చుట్టు పక్కల మండలాలు, జిల్లాల నుంచి కూడా రైతులు తాము పండించిన ధాన్యం, వేరుశనగ, పెసర్లు, మొక్కజొన్నలు, శనగలు జమ్మికుంట మార్కెట్‌కు తీసుకువచ్చేవారు. అందుకు తగ్గట్టుగానే పట్టణంలో రైస్ మిల్లు, నూనె మిల్లులు ఏర్పడ్డాయి. రెండున్నర దశాబ్దాల క్రితం నుంచి ఈ ప్రాంతంలో పత్తి పండించటం, ఆ పంటను స్థానికంగా ఉన్న వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు కమీషన్‌పై తరలించేవారు. క్రమక్రమంగా స్థానికంగా జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రత్యేకంగా పత్తి కొనుగోలు కోసం 2003లో కేశవపూర్ రోడ్డులోని నూతన వ్యవసాయ మార్కెట్‌ను అప్పటి మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి నిత్యం కోట్లాది రుపాయల పత్తి వ్యాపారం సాగుతోంది. ప్రతి రోజు 20వేల పత్తి బస్తాల పైచిలుకు రైతులు విక్రయానికి తీసుకువచ్చేవారు. దీంతో మార్కెట్ అంతా తెల్ల బంగారంతో నిండిపోయేది. పత్తి దిగుబడులు క్రమేపీ పెరుగడంతో జిన్నింగ్ మిల్లులు అదే తరహాలో పెరుగుతూ వచ్చాయి. మార్కెట్‌కు వచ్చిన పత్తిని ఖరీదుదారులు కొనుగోలు చేసి, వారి మిల్లుల్లో జిన్నింగ్, ప్రెస్సింగ్ చేసి బేళ్లు తయారు చేస్తారు. వాటిని వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలైన తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్, మధురై, తిరుపూర్, తిర్నలవేలి, శీలం, రాజాపాలేం ప్రాంతాల్లో విక్రయిస్తారు. అక్కడ కోట్లలో పత్తి బేళ్ల విక్రయాలు జరుపుతున్నప్పటికీ నమ్మకంపై ఆధారంగానే విక్రయాలు జరుపుతుంటారు. ఇక్కడి నుంచి పత్తి బేళ్లతో బయల్దేరిన లారీలు కానరాకుండాపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.

తగ్గిన జిన్నింగ్ మిల్లులు

రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంతరించుకున్న జమ్మికుంట పత్తి మార్కెట్ ప్రస్తుతం కొంత కళ తప్పిందని చెప్పవచ్చు. పట్టణంలో 18వరకు జిన్నింగ్ మిల్లులు ఉండేవి. సుమారు 30మంది పైచిలుకు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేపట్టేవారు. ప్రస్తుతం ఆరు మిల్లులు మాత్రమే నడుస్తున్నాయి. ఇక్కడ లాభాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారం కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా కార్మికులు, కూలీలకు ఉపాధి తగ్గింది. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పూర్వవైభవం కోసం తగు రీతిలో చర్యలు చేపడితే వ్యాపారం కళకళలాడి ఉపాధి మార్గాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

క్రైం కార్నర్

సింగారంలో వ్యవసాయ కూలీ బలవన్మరణం

ఎలారెడ్డిపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలోని వ్యవసాయ కూలీ వాసరి పెద్ద బాలయ్య(57) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు పెద్ద బాలయ్య వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని జీవిస్తుండేవాడు. పదేళ్ల కిందట అతని భార్య పద్మ అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురైన పెద్ద బాలయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న రాత్రి అతని తల్లి లక్ష్మీ ఇంటిలో భోజనం చేసిన పెద్దబాలయ్య తన ఇంటికి వెళ్లి నిద్రించాడు. ఆదివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఆయన కొడుకు రాజు తలుపులను తట్టాడు. భవన స్లాబ్‌కు పెద్దబాలయ్య ఉరి వేసుకుని కనిపించాడు. చుట్టు పక్కల వారి సహాయంతో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన వ్యక్తి

గన్నేరువరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కారు డ్రైవర్ గాయపడిన బాధితుడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మృతుడి పేరు, ఊరు తెలియదని, అతడు సుమారు 30 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఫొటోఆధారంగా ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మృతిడి తరపున ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పొలంలోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం.. ఒకరి మృతి

కోనరావుపేట డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన బెజిగం అనిల్ (37) అనే యువకుడు ఆదివారం ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శివంగాలపల్లికి చెందిన అనిల్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. అత్తగారి గ్రామం కనగర్తికి వెళ్తుండగా నిజామాబాద్ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో బైక్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. గాయాలవడంతో పొలంలో పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి

బీర్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో గాయాలపాలై చికిత్స పొందుతూ బత్తిని పుష్ప(40) మృతి చెందినట్లు ఎస్సై కుమార స్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గుండ భూమక్క లింగన్నల కుమార్తె పుష్పను సారంగాపూర్ మండలంలోని బట్టపల్లి గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్‌కు ఇచ్చి 20 ఏళ్ల క్రిం రెండో వివాహం చేశారు. దంపతులిద్దరూ తరచూ గొడవ పడేవాడు. ఈ నెల 13న కూడా శ్రీనివాస్ పుష్పతో గొడవ కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పుష్ప తల్లి భూమక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీకి చెందిన నోముల వంశీకృష్ణ(25) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన వంశీకృష్ణ ఆరు నెలల నుంచి హైదరాబాద్‌లోని ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 13న కాలనీకి వచ్చిన వంశీకృష్ణ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వంశీకృష్ణ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చదువుకు తగిన ఉద్యోగం రాలేదని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యవసాయ బావిలో శిశువు మృతదేహం

మేడిపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆదివారం నవజాత శిశువు మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. గ్రామస్థుల ద్వారా సమాచరం తెలుసుకున్న పోలీసులు మగ శిశువు మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గడ్డం గంగారెడ్డికి చెందిన వ్యవసాయ బావి రోడ్డుకు పక్కన ఉండటంతో మృతి చెందిన శిశువును ఎవరైనా పడివేశారా లేక ఇంకా ఏమైనా కారాణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

తొలిరోజు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

సగం కన్నా తక్కువగా హాజరైన అభ్యర్థులు

పరీక్ష సరళిని పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్

పరీక్షకు ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిన అభ్యర్థిని

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు ఆదివారం మొదటి రోజు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 35 సెంటర్‌లను ఏర్పాటు చేయగా, సుమారు 10,907 మంది అభ్యర్థులకు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఉదయం నిర్వహించిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5274 మంది అభ్యర్థులు హాజరుకాగా, 5633 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు సంబంధించి 5222 మంది అభ్యర్థులు హాజరుకాగా, 5685 మంది గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా చూస్తే ఉదయం రపరీక్షకు 48.35 హాజరుశాతం, మధ్యాహ్న పరీక్షకు 47.88 శాతం మాత్రమే అభ్యర్థులు హాజరు అయ్యారు. దీంతో సగం మంది అభ్యర్థులు పరీక్ష రాయకపోగా, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు సుమారు 52 మంది అభ్యర్థులు గైర్హాజరు అవడం గమనార్హం.

● పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

గ్రూప్-2 పరీక్షల నిర్వహణ సరళిని కలెక్టర్ పరిశీలించారు. కోరుట్ల అరుణోదయ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లను ఆయన పరిశీలించారు. సోమవారం జరిగే నాలుగు పరీక్షలను సైతం ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.



కోరుట్లలో పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

● జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన నవ్య అనే అభ్యర్థిని పరీక్షకు ఆలస్యంగా రావడంతో సెంటర్‌లోకి అధికారులు అనుమతించలేదు. దీంతో సదరు అభ్యర్థి పరీక్ష రాయకుండానే వెనుదిరిగింది. రామకృష్ణ, నలంద కళాశాల సెంటర్ల వద్ద సైతం మరో ముగ్గురు వెనుదిరిగారు.

కోరుట్ల : కోరుట్లలో పరీక్ష కేంద్రంలో నిమిషం ఆలస్యంగా చేరుకున్న అభ్యర్థిని పోలీసులు, అధికారులు అనుమతించకపోవడంతో పరీక్ష కేంద్రం ముందు తన హాల్ టికెట్‌ను చింపివేసి నిరాశతో వెనుతిరిగాడు. పట్టణంలోని 7 కేంద్రాలలో అధికారులు గ్రూప్-2 పరీక్షలను నిర్వహించారు. పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో 264 మందికి 102 మంది హాజరయ్యారు. ప్రభుత్వం జూనియర్ బాలికల కళాశాలలో 192 మందికి 75 మంది హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 240 మందికి 92 మంది హాజరయ్యారు. ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో 288 మందికి 124 మంది హాజరయ్యారు. అరుణోధయ డిగ్రీ కళాశాలలో 312 మందికి 107 మంది హాజరయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 264 మందికి 97 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణకు పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాముల ఆధ్వర్యంలో కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు నిరంజన్ రెడ్డి, సురేష్ బాబులు తమ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు వారి సిబ్బందితో బారీ బందోబస్తును నిర్వహించారు. పలు పరీక్ష కేంద్రాలను ఆర్‌డీఓ జీవాకర్ రెడ్డి పరిశీలించారు.

కొడిమ్యాల : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్షలు మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జేఎన్‌టీయులో మూడు పరీక్షా కేంద్రాలలో మొదటి సెంటర్‌లో 624 మంది అభ్యర్థులకు గాను 295 మంది అభ్యర్థులు, రెండవ సెంటర్‌లో 599 మందికి గాను 220 మంది అభ్యర్థులు, మూడవ సెంటర్‌లో 288 మందికి గాను 105 హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరిండెంట్లు డాక్టర్ ఎస్. జగదీష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంగీత, శ్రీకాంత్ తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. మూడు కేంద్రాలలో 1511 మంది అభ్యర్థులకు గాను 893 మంది అభ్యర్థులు గైర్హాజరైనారు. ఆరుగురు అభ్యర్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా కేంద్రానికి రాగ వారిని అధికారులు లోనికి అనుమతించలేదు. ఎలాంటి అవాంచనీయ సంఘటన జరుగకుండ డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఎస్సై రవీందర్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కొండగట్టులో కవితను కలిసిన కార్యకర్తలు



కొండగట్టులో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మల్యాల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పర్యటనకు వెలుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మార్గమధ్యంలోని కొండగట్టులో కాసేపు ఆగారు. ఓ టీ స్టాల్‌లో కూర్చుని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి టీ తాగారు. కాసేపు వారితో ముచ్చటించి సెల్ఫీలు దిగారు. కొండగట్టు ఆలయం, స్థానిక అంశాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగిత్యాలకు వెళ్లారు. కవిత వెంట మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొండపల్కుల రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి నాయకులు ఉన్నారు

ఎమ్మెల్సీ పరామర్శ

రాయికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల వ్యవ సాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ ఎలగందుల ఉదయశ్రీ భర్త లింగం గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాయికల్‌కు చేరుకుని పరామర్శించారు. వీరి వెంట మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్, మాజీ ఎంపీపీ సంధ్యారాణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్ ఉన్నారు.

అంజన్న భక్తుల గిరిప్రదిక్షణ

మల్యాల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి గుట్ట చుట్టు ఆదివారం భక్తులు గిరిప్రదిక్షణ చేశారు. హైదరాబాద్‌లోని చిలుకూరి బాలాజీ శివాలయ ప్రధానర్చకులు ఆత్మరాం మహారాజ్ ఆధ్వర్యంలో ప్రతి పౌర్ణమి రోజు గత ఏడాదిగా నిర్వహిస్తున్న గిరిప్రదిక్షణ కోసం ఇటీవల రహదారి ఏర్పాటు చేశారు. దీంతో వందలాదిగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. గిరిప్రదిక్షణ పూర్తి అయ్యాక స్వామి వారికి మొక్కులు తీర్చుకుంటున్నారు.

ఘనంగా మల్లన్న బోనాల జాతర



బోనాలతో ఊరేగింపుగా వెల్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ శివారులోని మల్లన్న స్వామిని భక్తులు ఉదయం నుంచి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతరలో స్వామి వారికి బోనాల జాతర చేపట్టగా భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేశారు. అనంతరం భక్తులు బోనం నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుల మధ్య నృత్యాలతో శోభయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనంతో ఆలయం చుట్ట ప్రదిక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నిత్యజనగణమణలో అయ్యప్ప స్వాములు



జాతీయగీతాలాపన చేస్తున్న అయ్యప్ప స్వాములు

మల్యాల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మల్యాల మేజర్ గ్రామపంచాయితీలో రెండేళ్లుగా నిర్వహిస్తున్న నిత్యజనగణమణలో భాగంగా ఆదివారం అయ్యప్పదీక్ష పరులు జనగణమణ ఆలపించారు. స్వాములు పూజా కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో నిత్యజనగణమణ రావడంతో ఎక్కడివారు అక్కడే నిల్చుని దేశభక్తిని చాటారు.

బినామీలకు అడ్డుకట్ట

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమి కోన్నత జడ్పీ, ఉన్నత పాఠశాలలు, తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, కేజీబీవీలు, గురుకులాల్లో పనిచేసే ఉపాధ్యాయుల ఫొటోలను అందరికి కనిపించే ప్రాంతాల్లో ఉంచనున్నారు, గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను కొందరు గ్రామస్థులు గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. అప్పుడప్పుడు వచ్చేవారు తెలియదు. అలాంటి పరిస్థితుల్లో పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలు ఉంటే వెంటనే గుర్తిస్తారు. ఇలా చేయటం వల్ల ఒకరికి బదులు మరొకరు పనిచేయడానికి ఏ మాత్రం వీలు ఉండదు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో పనిచేసే డుమ్మా ఉపాధ్యాయులకు చెక్ పెట్టే అవకాశం ఏర్పడింది.

● ఫొటోల సేకరణ ప్రారంభం

విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న పాఠశాలల్లో ఆగమేఘాల మీద ఉపాధ్యాయుల ఫొటోలను ఏర్పాటు ప్రారంభించారు. గతంలో కేవలం ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలు మాత్రమే ఉండేవి. కానీ ఇక నుంచి వివరాల పక్కనే వారి ఫొటోలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో అన్ని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యా యుల ఫొటోలను ప్రధానో పాధ్యాయులు సేకరించే పనిలో నిమగ్నమైయ్యారు. అదేవిధంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలతో పాటు వాటికింద పేర్లు, ఏ విషయం బోధిస్తారు.. సెల్ నంబరు రాయాలని సర్కారు సూచించింది. తద్వారా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులపై స్పష్టమైన అవగాహణ ఉంటుంది.

● అమలుకాని బయోమెట్రిక్..

పాఠశాలల్లో పారదర్శకంగా బోధన సాగాలనే ఉద్దేశంతో బయోమెట్రిక్ విధానాన్ని సుమారు ఆరేళ్ల క్రితం అమలులోకి తెచ్చారు. కొద్ది కాలంలోనే ఆప్రక్రియ మందగించింది. అనేక చోట్ల సిగ్నల్స్ లేవని, ఇతర సాంకేతిక కారణాల వల్ల మాన్యువల్ రిజిస్టర్లలో ఉపాధ్యాయులు సంతకాలు చేస్తున్నారు. ఆ తరువాత విద్యాశాఖ ఆధ్వర్యంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. పకడ్బందీగా వేలిముద్రల ద్వారా సంతకాలు తీసుకొని హాజరు నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికీ కొన్ని పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. వివిధ పాఠశాలల్లో పాత పద్ధతిలోనే హాజరు నమోదు చేస్తున్నారు.

● ఆదేశాలను పక్కాగా అమలు చేస్తాం



కె రాము, జిల్లా విద్యాశాఖాధికారి

ఉపాధ్యాయుల ఫొటోలను పాఠశాలల్లో ప్రదర్శించే విధంగా ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కాగా అమలు చేస్తాము. పారదర్శకత పెరిగెందుకే ప్రభుత్వం ఫొటోల ప్రదర్శన నిర్ణయం తీసుకుంది. ఈ విధానం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులకు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలు స్పష్టంగా తెలిసే అవకాశాలున్నాయి. ఎలాంటి అవకతవకలకు చోటు కలగదు.

సంక్రాంతికి రైతు రైతు బంధు

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) సంక్రాంతికి రైతులందరి ఖాతాలలో రైతు బంధు డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం వేస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ రెవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతు సంక్షేమం, మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. అలాగే ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచడంతో పాటు 90 శాతం ఆరోగ్య సమస్యలను ఆరోగ్యశ్రీలో చేర్చారని అన్నారు.

ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలి

కేంద్రమంత్రికి తపస్ జిల్లా బాధ్యుల వినతి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 15(అగ్రికల్చర్) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆదాయపు పన్ను మినహాయింపులు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) బాధ్యులు ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కరీంనగర్‌లోని తన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.7లక్షల వరకు పూర్తిస్థాయి ఆదాయపు పన్ను మినహాయిస్తూ, ప్రస్తుతం ఉన్న 10,20,30 శాతం పన్ను స్లాబ్ రేట్లను మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ మాట్లాడుతూ సంబంధిత మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ బాధ్యులు భోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావు, అయిల్నేని నరేందర్‌రావు, వొడ్నాల రాజశేఖర్, వెంకట రమణరావు, శ్రీకాంత్ తదితరులున్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు

జ్యోతి స్కూల్‌లో గణిత ఒలంపియాడ్ టెస్ట్

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణతం పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు పట్టణంలోని జ్యోతి స్కూల్ ఐఐటీ అకాడమీలో గణిత ఒలంపియాడ్ పేరుతో పరీక్ష నిర్వహించారు. పరీక్షకు సుమారు 2వేల మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ. 25వేల నగదు బహుమతితో పాటు, 50 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్ రావు మాట్లాడుతూ పరీక్ష ద్వారా గణిత సమస్యలు పరిష్కరించే నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పల్లె దవాఖానాలతో పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగం

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానాల ఏర్పాటుతో పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని బోర్నపెల్లి, ధర్మాజీపేట గ్రామాల్లో రూ.20 లక్షల చొప్పున నిధులతో నిర్మించనున్న ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య మందిర్ పల్లె దవాఖానాలకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం ద్వారానే వైద్యులకు గుర్తింపు వస్తుందన్నారు. రూ.14 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయన్నారు. బోర్నపెల్లి-జగన్నాథ్‌పూర్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. రాయికల్ మండలానికి ఆరుపల్లె దవాఖానాలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో శ్రీనివాస్, నాయకులు కోల శ్రీనివాస్, రవీందర్ రావు, గన్నె రాజరెడ్డి, పడిగెల రవీందర్, రెడ్డి, పాదం లత రాజు, మాజీ ఎంపీటీసీ బీర్‌సాబ్, మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి గౌడ్, మాజీ మండల కోఆప్షన్ ముఖీద్, ప్రవీణ్ రావు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లి ఎస్సైగా కిరణ్ బాధ్యతల స్వీకరణ

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి ఎస్సైగా కిరణ్ కుమార్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. మల్లాపూర్ ఎస్సైగా ఉన్న కిరణ్ కుమార్‌ను ఉన్నతాధికారులు మెట్‌పల్లి ఎస్సైగా బదిలీ చేయగా ఇక్కడ పని చేస్తున్న ఎస్సై చిరంజీవి కొన్ని రోజుల క్రితం నిజామాబాదు జిల్లాలోని నంది పేట ఎస్సైగా బదీలపై వెళ్లాడు. దీంతో మెట్‌పల్లి ఎస్ఐగా కిరణ్ కుమార్ బాధ్యతలను స్వీకరించంగా పలు పార్టీలకు చెందిన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆహ్వానించారు.

మల్లాపూర్ ఎస్సైగా రాజు..

మల్లాపూర్, డిసెంబరు, 15 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ ఎస్సైగా రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మల్లాపూర్ ఎస్సైగా విధులు నిర్వహించిన కిరణ్ కుమార్‌ను ఇటీవల మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మెట్‌పల్లి ఎస్సై-2గా ఉన్న రాజును మల్లాపూర్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సై రాజుకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. ఆయన మాట్లాడుతూ మల్లాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపిక

మల్యాల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన తొట్ల మధుకర్ అనే యువకుడు శుక్రవారం రాత్రి వెలువడిన ఫలితాల్లో బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మధుకర్ గ్రామంలోనే ఉచితంగా శిక్షణ అందించే ప్రభుత్వ పీడీ గంగసాగర్ వద్ద శిక్షణ పొందాడు. ప్రస్తుతం మధుకర్ గ్రూప్-2 పరీక్ష రాస్తున్నాడు. బీఎస్ఎఫ్‌కు ఎంపికైన మధుకర్‌ను గ్రామస్తులు, తదితరులు అభినందించారు.

రజక సంఘం మండలం అధ్యక్షుడిగా నర్సయ్య

చందుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల రజక సంఘం అధ్యక్షుడిగా సుద్దాల నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల రజక సంఘం సమావేశంలో 2025-27 సంవత్సరాలకు మండల కార్యవర్గ ఎన్నికలను జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య మడేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడిగా మారుపాక దేవరాజు, ప్రధాన కార్యదర్శిగా వనపర్తి సతీష్, కార్యదర్శిగా ఒరగంటి రాజు, కోశాధికారిగా కొడగంటి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మొగిలి అంజయ్య, రేవంత్ కుంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్ వాడీ కేంద్రాలు

● మౌలిక సదుపాయాలు కరువు

బుగ్గారం డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె ఇళ్లల్లో నడుస్తున్నాయి. గర్భిణులకు, చిన్నారులకు అంగన్‌వాడీలు పోషక ఆహారం అందిస్తూ నిరంతరం వారి ఆరోగ్య ప్రగతిని నమోదు చేయాలి. పుట్టిన శిశువుల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల సంరక్షణ బాధ్యత అంతా అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో కొనసాగుతుంది. పిల్లలకు మూడేళ్ల నుంచి తర్వాత అంగన్వాడీ కేంద్రం ద్వారానే ఆట పాటలతో విద్యను అందించడం ప్రధాన కార్యక్రమం. ఇందుకోసం పిల్లలను ఆకర్షించే విధంగా కేంద్రాలలో వివిధ రకాల మౌలిక వసతులు ఉండాలి కానీ మండలంలోని పలు గ్రామాలలో సొంత భవనాలు కరువై అద్దె భవనాలలో అంగన్వాడి కేంద్రాలు కొనసాగుతున్నాయి ఇక వీటిలో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే.

● పదింటికే సొంత భవనాలు

మండలంలోని 11 గ్రామాలు ఉండగా అంగన్వాడి కేంద్రాలు 25 ఉన్నాయి. వీటిలో కేవలం 10 సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 11 కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. మిగతా 4 ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్నాయి. వీటిలో పలు కేంద్రాలు శీతలమవుతున్న భవనంలోనే ఉన్నాయి చాలా వాటిలో కావలసినంత స్థలం లేదు. అందువల్ల పిల్లలకు ఆటలకు ఆడడానికి అవకాశం లేకుండా పోయింది. అలాగే కొన్ని కేంద్రాలు కేవలం ఒకే రూములో నడుస్తున్నాయి. దీంతో గర్భిణులకు పిల్లలకు అందించే పోషక ఆహారం నిలువ ఉంచడం పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడం కష్టంగా మారింది. ఆటపాటలకు తగినన్ని సౌకర్యాలు లేకపోవడంతో కొన్ని కేంద్రాలలో ఆట వస్తువులు నిరుపేగంగా ఉంటున్నాయి మండలంలో మొత్తం అంగన్వాడీలో పిల్లలు 1358 మంది ఉన్నారు. కొంతకాలంగా అంగన్వాడీ సెంటర్లలో అందించే పూర్వ ప్రాథమిక విద్యలో చేరిన చిన్నారులు కొంతకాలం బాల బడికి అలవాటు కాగానే వారిని సమీపంలో ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం అధికమైనప్పటికీ అంగన్వాడి కేంద్రాల నుంచి పిల్లలను ప్రైవేటుకి పంపించడానికి మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలో పలు కార్పొరేట్ పాఠశాలలు సైతం ప్రత్యేకంగా బస్సులు నడిపిస్తున్నాయి. దీంతో అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించి నట్లయితే విద్యార్థులు నమోదు జరిగే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రతి గ్రామంలో అని రకాల హంగులతో విశాలమైన ఆట స్థలంతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి పక్కా భవనాలు నిర్మిస్తే గ్రామాలలోని పేద ప్రజలకు ఎంతో ప్రయోజ కరంగా ఉంటుంది.



బీజీఆర్ బుగ్గారం మండల కేంద్రంలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్ వాడీ కేంద్రం

● పక్కా భవనాలు నిర్మించాలి



పక్క భవనాలు లేక అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు, సిబ్బందికి అసౌకర్యంగా ఉంది. ఓకే గది ఉన్నచోట కనీస సౌకర్యాలు సైతం లేక ఇబ్బందిగా ఉంటోంది. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొన్ని, అద్దెకు దొరక పోవడంతో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కూడా కేంద్రాలను నడిపిస్తున్నారు.

- మొగిలి వందన, బుగ్గారం

● వసతులు కల్పించాలి ..



ప్రస్తుతం అంగన్వాడి కేంద్రాలలో ఆధునిక వసతులు కల్పించి మెరుగైన సేవలందించాలి. ప్రైవేటుకు దీటుగా బోధన అందించినట్లయితే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పిల్లల సంఖ్య కూడా పెరుగుతుంది. సౌకర్యాలు లేకనే చాలా మంది చేరడం లేదు. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

- పల్లికొండ అర్చన

ఘనంగా దత్త జయంతి వేడుకలు

కోరుట్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాయిబాబ దేవాలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దత్త జయంతి వేడుకలో భాగంగా సామూహిక గురు చరిత్ర సప్తాహ పారాయణ మహా యజ్ఞం నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని 108 స్థాపితకలశములచే అనఘాలక్ష్మి సమేత దత్తాత్రేయ స్వామి వారికి భక్తులు సామూహిక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని దత్తాత్రేయ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి శోభాయాత్ర నిర్వహించారు.

కొడిమ్యాల : మండలంలోని పూడూర్ గ్రామ శ్రీదత్త ఆలయంలో ఆదివారం దత్తజయంతి, ఆరవ వార్షికోత్సవాన్ని ముక్తానందస్వామి కరకమలాలతో గోసికొండ దామోదర్ దంపతులు ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ధ్వజారోహణ, ప్రత్యేక పూజలు, పల్లకి సేవ అన్నదానం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ప్రజాప్రతినిధులు రాంరెడ్డి, లింగారెడ్డి, ఆశ్రమ అర్చకులు నరహరి, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారికి అభిషేకం చేస్తున్న భక్తులు, వేదపండితులు

జగిత్యాల అర్బన్ : జగిత్యాల పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో దత్త జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వారం రోజులుగా 108 మంది భక్తులచే దత్తచరిత్ర పారాయణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మెడిపెల్లి శ్రీనివాస శర్మ, రుద్రంగి గోపాల కృష్ణ దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ దంపతులు, పద్మశాలి సంఘం అధ్యక్షులు భోగ గంగాధర్, మాజీ అధ్యక్షులు ఆకుబత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మదుయాష్కి జన్మదిన వేడుకలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ జన్మదిన వేడుకలు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ఘణంగా నిర్వహించారు. పట్టణంలోని ఇందిరా బవన్‌లో జరిగిన వేడుకలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కేక్ కట్ చేయగా జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి స్థానిక కౌన్సిలర్‌లతో కలిసి కేక్ కట్ చేశారు.

కోరుట్లలో..

కోరుట్ల : పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, నిజామాబాదు మాజీ ఎంపీ మదుయాష్కి గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని జువ్వాడి భవనంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు తిరుమల గంగాధర్, రాజం, వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, శంకర్ గౌడ్, లింబాద్రీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం

కథలాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన పులి శిరీషహరిప్రసాద్‌ను ఆదివారం మండలంలోని గంభీర్‌పూర్ పద్మశాలీ సంఘ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు రాచర్ల లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడు చిలువేరి రాజేశం, మాజీ సర్పంచులు పోతు సింధూజ రాజశేఖర్, గుంటుక నీరజమనోహర్, సంఘ సభ్యులు ఉన్నారు.

రెండు గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీల నియామకం

కథలాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తక్కళ్లపల్లి, రాజారాం తండా గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీలను నియమించారు. తక్కళ్లపల్లిలో మిట్టపల్లి లక్ష్మారెడ్డి, మిట్టపల్లి జైపాల్‌రెడ్డి, ఎల్ల గంగాధర్, సైదు నరేశ్, బర్రె మధు, గుగ్గిళ్ల ప్రసాద్, రాజారాం తండాలో కోరుట్ల రాజేశ్, అన్నం మహేశ్, బోదాసు కమలాకర్, ఇస్లావత్ తిరుపతిలను నియమించారు. తదనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనందరెడ్డి, మల్యాల మారుతి, కాశో జి ప్రతాప్, క్యాతం లింగారెడ్డి, పంజాల వెంకట్రాములు ఉన్నారు.